క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సంధ్య



సంధ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదపూడి: జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.సంధ్య రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఈ నెల 26న కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో తమ విద్యార్థి ప్రతిభ చూపిందన్నారు. ఈ నేపథ్యంలో సంధ్యను సర్పంచ్ లంక మున్నీ, పీడీ కె.తులసి, పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ వల్లు శిరీష, వైస్ చైర్మన్ దడాల దుర్గ అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న కప్పల స్వామి

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లోని భూదేవీ, శ్రీదేవీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కప్పల స్వామి (టైపు మాస్టారు) రూ.50,001 విరాళం సమర్పించారు. ఆ మొత్తాని తన స్నేహితులతో కలిసి శనివారం ఆలయంలో అర్చకులకు అందజేశారు.

డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రంజిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు

రంగంపేట: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా య.రంజిత్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు మండల వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన శిధర్ పోలవరం భూసేకరణ స్పెషల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

సీతానగరం: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణాన్ని శనివారం మండల సమాఖ్య సిబ్బంది శుభ్రం చేశారు. డీఆర్‌డీఏ ఏపీఎం మహాలక్ష్మి, క్లస్టర్ కో ఆర్డినేటర్ బి.రామచక్రం, గ్రామ సంఘం సహాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యం అవసరం

రాజానగరం: ప్రతి ఒక్కరికీ భావ వ్యక్తీకరణ నైపుణ్యం ఉండాలని గైట్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భానుప్రకాష్ అన్నారు. దివాన్ చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు భావవ్యక్తీకరణ నైపుణ్యంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎన్‌మూర్తి మాట్లాడుతూ ఆటో మెబైల్ రంగంలో వాహనాల సామర్థ్యం, అవి పనిచేసే విధానంపై అవగాహన కలిగించారు. హెచ్ఎం వి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన ఎదురయ్యే సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ జయానందకుమార్ వివరించారు.

రేబిస్‌పై అవగాహన



రేబిస్ డే కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రాజు, సిబ్బంది

సీతానగరం: ఏ జంతువు కరిచినా యాంటీ రేబిస్ ఇంజెక్షన్ చేయించుకోవాలని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎస్.రాజు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ రేబిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, ఎల్‌టీ శిల్ప, స్టాఫ్ నర్స్ నాగమణి పాల్గొన్నారు.



రామవరం బాపనమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పందలపాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



కాపవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



సీతానగరం శ్రీమహాలక్ష్మి అలయంలో..

లడ్డూ పేరుతో చంద్రబాబు రాజకీయం

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి
- వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పూజలు



రాజానగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జక్కంపూడి రాజా, విజయలక్ష్మి తదితరులు



రాజుపాలెంలో స్వామిని దర్శించుకుంటున్న పార్టీ నాయకులు



కొంకుదురులో వైఎస్సార్ సీపీ నాయకుల పూజలు



సుభద్రంపేట శివాలయంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తదితరులు

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డూ పేరుతో రాజకీయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. తిరుపతి వేంకటేశ్వర స్వామిని తన స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు అనైతికమన్నారు. ఆయనకు దేవుడు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ మేరకు శనివారం రాజానగరంలోని రావుల చెరువు గట్టున ఉన్న వేంకటేశ్వరుని ఆలయంలో పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి

జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తిరుమలేశుని లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తుందన్నారు. తయారీలో కల్తీ నెయ్యిని ఉపయోగించారంటూ అబద్ధపు ప్రచారంతో మహాపచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంచి బుద్ధిని ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నామన్నారు. విజయవాడ వరదలలో బ్యారేజీని కూల్చడానికి వైఎస్సార్ సీపీ నాయకులే బోట్లను పంపించి, గేట్లకు అడ్డుగా పెట్టారని దుష్ప్రచారం చేశారన్నారు. ఎన్నికలలో చెప్పిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు మర్చిపోయారన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమి చేశామో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న కూటమి ప్రభుత్వం, తమ అసమర్థత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కథను అల్లి, కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా రాజకీయం చేసిందని విమర్శించారు. ఇంతటి దారుణానికి చంద్రబాబు ఒడిగడితే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు వంత పలుకుతూ, హంగామా చేయడం విచిత్రంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామిని ఆరాధించే కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న తిరుమలేశుని లడ్డూ వ్యవహారంలో నిజాలను బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు వల్లభొట్టి రమణ, నాయకులు ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, వాద్రేవు శ్రీనివాస్‌కుమార్, సంగీత ప్రసాద్, పి.శ్రీను, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకే..

పెదపూడి: చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి పాతఊరులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై ఆలయాల్లో పూజలు చేశామన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ దురుద్దేశంతో తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టత, టీటీడీ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారన్నారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కల్తీ జరిగినట్లు, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేసినందుకు ప్రాయశ్చిత్తంగా చంద్రబాబు నాయుడు పాపాన్ని ప్రక్షాళన చేయాలని పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి టౌన్ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీ బాలకృష్ణారెడ్డి, సర్పంచి వారా కుమారి, నల్లమిల్లి అచ్యుత రామారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, కొండేటి భీమేష్, ఏడుకొండలు, బండారు శ్రీను, గుంటూరు శ్రీను, విజయరెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

- తిరుమల ఆలయ పవిత్రత మంట కలిపేలా విధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ వేంకటేశ్వరస్వామిని కోరుతున్నామని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ అన్నారు. రాజుపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ ప్రాబల్యం కోసం కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల పుష్పవతి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, పార్టీ నాయకులు డి.కృష్ణ, కె.శ్రీను పాల్గొన్నారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో గ్రామ దేవత బాపనమ్మ తల్లి ఆలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా కూటమి నాయకులు తిరుపతి లడ్డూ తయారీ నేతిలో కల్తీ జరిగిందని ఆరోపణలు చేస్తున్నారన్నారు. అయితే టీడీపీ కార్యనిర్వహణ అధికారి మాత్రం ఆ నేతితో లడ్డూలు తయారు చేయలేదని, ఆ నేతిని వెనక్కి పంపించినట్టు చెప్పారన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవింద రెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, నాయకులు కర్రి గాంధీరెడ్డి, లంక ప్రసాద్, కర్రి గోపాలరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలి

బిక్కవోలు: చంద్రబాబుకు దేవుడు సద్బుద్ధిని ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేవుడి విషయంలో రాజకీయాలు తగవని హితవు పలికారు. పందలపాకలో గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కొంకుదురులో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, కాపవరంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకట రమణ, ఎంపీటీసీ మార్నెళ్ల భీష్ముడు, మెళ్లూరులో ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, రంగాపురంలో సర్పంచ్ గండి కోట వీరభద్రరావు, బిక్కవోలులో గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ పాపం చంద్రబాబుదే

రంగంపేట: తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేందుకు చంద్రబాబు చేసిన పాపానికి ప్రక్షాళన కోసం వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం మండల వ్యాప్తంగా ప్రత్యేక పూజలు చేశారు. సుభద్రంపేట శివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ తిరుపతి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగి లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. మర్రిపూడిలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్ వేము మాధవి, ఈలకొలనులో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, సింగంపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, నల్లమిల్లి, జి.దొంతమూరు, వీరంపాలెం, ఎస్టీ రాజాపురం, దొడ్డిగుంట, ముకుందవరం, వెంకటాపురం, వడిశలేరు గ్రామాల్లో సర్పంచ్‌లు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రంగంపేటలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

చంద్రబాబు కుట్రల నుంచి కాపాడాలని..

సీతానగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్రల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు అన్నారు. తిరుపతి లడ్డూపై వివాదానికి తెరలేపిన చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నామన్నారు. ఈ మేరకు శనివారం సీతానగరంలోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, సలాది వాసు, వలవల సత్తిబాబు, వలవల కొండబాబు, తోరం పోశయ్య, అధికారి శ్రీను, పెదపాటి ప్రసాద్, తవిటికి ఆనందరావు పాల్గొన్నారు.

తిరుపతి పవిత్రతను కాపాడాలి



దివాన్‌చెరువు వేంకటేశ్వరుని ఆలయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజానగరం: తిరుపతి పవిత్రతను, ప్రతిష్ఠను కాపాడాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తిరుమలేశుని లడ్డూ ప్రసాదం విషయమై రాజకీయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని తిరుమల శ్రీనివాసుని వేడుకుంటూ దివాన్ చెరువులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీను, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, పలివెల స్వామి, ఎస్వి తరుణ్, ఈలి గోపాలం పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి



చంద్రేడు సచివాలయంలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ వేణుగోపాల్



పెదపూడిలో మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రసాదరావు

రంగంపేట: మండలంలోని పీఎంఏవై లబ్ధిదారులు 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ సీహెచ్ వేణుగోపాల్ సూచించారు. మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా చంద్రేడు గ్రామ సచివాలయంలో శనివారం సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఎంఏవై పథకంలో మంజూరై రూఫ్ లెవెల్, రూఫ్ కాస్ట్ దశలో ఉన్న లక్ష గృహాలను 2024 అక్టోబరు నాటికి, మిగిలిన గృహాలను 2025 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. పునాదుల వరకు నిర్మించుకున్నవారు, అసలు మొదలు పెట్టకుండా ఉన్నవారికి స్త్రీశక్తి, డ్వాక్రా ద్వారా రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఇసుక, మెటల్, ఐరన్, సిమెంట్ వెంటనే మంజూరు చేస్తారన్నారు. మార్చి 2025 తరువాత కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి రుణ మంజూరు ఉండదన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పాండురంగారావు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

పెదపూడి: గత ప్రభుత్వంలో చేపట్టి వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు అన్నారు. పెదపూడి, జి.మామిడాడ గ్రామాల్లో శనివారం మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు లంక మున్ని, కలవల కృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహనీయుల జయంతి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి జాషువా, విప్లవ యోధుడు భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ వాస్తవ జీవితంలోని అసమానతలే తన కవితకు మూలాలుగా, మానవీయ విలువల వృక్షాన్ని కవితా శాఖలుగా విస్తరింపజేసిన విశ్వనరుడు జాషువా అని ప్రశంసించారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ పిరదౌసి, గబ్బిలం, ముసాఫిరులు, ముంతాజమహల్, నేతాజీ - బాపూజీ, కొత్తలోకం, కాందిశీకులు వంటి వైవిధ్య భరితమైన సాహిత్యాన్ని ఆంధ్రసాహితీ భారతికి నివేదన చేసిన మహాకవి జాషువా అని కొనియాడారు. అలాగే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రైతులకు మరిన్ని మెరుగైన సేవలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి పీఏసీఎస్ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కె.సుబ్బారావు అన్నారు. ఆ సొసైటీ ఆవరణలో శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లో రైతునేస్తం రుణాలను అందజేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. 2023-24 సంవత్సరానికి చెందిన ఆడిట్ రిపోర్టు ఆమోదించబడిందన్నారు. సీఈవో ఈదల సుదర్శనరావు మాట్లాడుతూ 751 మంది సభ్యులున్న సొసైటీ రూ.18.53 కోట్లతో నడుస్తోందన్నారు. సంఘం మాజీ చైర్ పర్సన్ బుడ్డిగ సత్యనారాయణమూర్తి, గజ్జెల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లాభాల బాటలోకి..

దోసకాయలపల్లి పీఏసీఎస్ లాభాల బాటలోకి వెళుతోందని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఏఆర్ శివకుమార్ అన్నారు. 575 మంది సభ్యులున్న పీఏసీఎస్ ద్వారా రూ.13.80 కోట్లు టర్నోవర్ జరుగుతోందన్నారు. సంఘం సీఈవో కొయిడాల శివ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్‌కు రెడ్డి త్రినాథ్, రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్‌కు పి.సుబ్బిరెడ్డి, కోరుకొండకు జె.శ్రీనివాస బాలాజీ, కొవ్వూరుకు జి.సత్యనారాయణ, దేవరపల్లికి బళ్ల శ్రీనివాసరావు, నిడదవోలుకు ఆర్‌జీ సతీష్‌బాబు, రంగంపేటకు డి.సుధ నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పి.హనుశ్రీని నియమించారు.

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా కేదారి శ్రీధర్

ఏపీస్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ రాజమహేంద్రవరం ఐఎంఎల్ డిపో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (మేనేజర్)గా కేదారి శ్రీధర్‌ను నియమించారు.

అసిస్టెంట్ కమిషనర్ పోస్టు మినహా..

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. దీంతో జిల్లా పరిధిలో ఒక అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, రెండు ఏఈఎస్‌లు పోస్టులను కేటాయించింది. ఇప్పటికే ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ లావణ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నాగ రాహుల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎం.వినీషను నియమించిన విషయం తెలిసిందే. ఈఎస్ లావణ్య, ఏఈఎస్ వినీష రెండు రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పోస్టును మాత్రం ప్రభుత్వం వేకెంట్‌లో ఉంచింది.

పౌష్టికాహారం ఆవశ్యకతను గుర్తించాలి



ఈలకొలనులో సామూహిక సీమంతం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ రాంబాబు



ఆరికరేవులలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేసిన సర్పంచ్ రెడ్డి నాగవీరవేణి

రంగంపేట: పౌష్టికాహారంతోనే మాతాశిశు మరణాలు అదుపు అవుతాయని, పౌష్టికాహార ఆవశ్యకతను అందరూ గుర్తించాలని వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు సూచించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ షేక్ గుల్జార్‌బేగం అధ్యక్షతన స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లుల్లో రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారం వండే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామ పంచాయతీ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను సర్పంచ్ రెడ్డి నాగవీరవేణి కుమారి చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. డాక్టర్ సలహాలు పాటించి ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనివ్వాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.జెస్సీఫ్లోరెన్స్, బిక్కవోలు సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డంటే ప్రయాణికులకు హడలే..



ఏడీబీ రోడ్డుపై వెంకన్నపేట సమీపంలో శనివారం సాయంత్రం ఏర్పడిన ట్రాఫిక్ జామ్

రాజానగరం: రాజానగరం - కాకినాడ ఏడీబీపై ప్రయాణమంటే జనం హడలిపోతున్నారు. గోతులతో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఇక వర్షాలు పడుతున్న సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తే పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. నరకం అంటే ఏమిటో ఇక్కడ చూస్తున్నామని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. పూర్తిగా ఛిద్రమైన రోడ్డుపై అన్నీ గుంతలే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో వర్షం నీరు చేరింది. ముఖ్యంగా రాజానగరం నుంచి వడిశలేరు వరకూ చెరువులను తలపించేలా గోతులు ఉన్నాయి. పొరపాటున ఆ గోతుల్లో ఏ వాహనం దిగినా ఇక అంతే. బయటకు తీయడానికి నానాయాతన పడాలి. దీంతో ఈ రోడ్డులో తరచూ ట్రాఫిక్ నిలిచి పోతోంది. ఇలాగే శనివారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డుకు అటూ ఇటూ రెండు కిలోమీటర్ల మేర వాహనాలను నిలిచిపోయాయి. ఈ రోడ్డుకు పనులు చేసే కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించాల్సి ఉందని, అవి ఇచ్చే వరకూ పనులు ముందుకు సాగడం లేదని సంబంధిత అధికారులు నిరంతరం చెబుతూనే ఉన్నారు. కానీ ఆ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు, ఈ రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనే ప్రశ్నలకు మాత్రం జవాబు ఉండటం లేదు.